నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | జులై 15, 2024 | www.navatelangana.com

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-నిర్మల్



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ వివరాలు ప్రకారం.. పట్టణంలోని గుల్జార్ మార్కెట్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం కనిపించిందని ఉదయం స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 50 నుండి 55 ఏండ్లు ఉంటుందని గుర్తించారు. లైట్ పింక్ కలర్ షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంటు ఉందని, అతని కుడి చతి మణికట్టు వద్ద ఓమ్ అని పచ్చ బొట్టు ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించామని, మృతుడికి సంబంధించిన బంధువులుంటే పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా డా.రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తాంసి



సినీ నిర్మాత, వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డా.రవి కిరణ్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో యాదవ సంఘ సభ్యులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి చిన్న పిల్లలకు పంచిపెట్టారు. రవికిరణ్ యాదవ్ వైకుంఠ ట్రస్ట్ ద్వారా నిరుపేద నిరుద్యోగ, విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమైన ఉచిత కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రామన్న, నరేష్, శరత్, గంభీర్, నవీన్ సురేష్, వీరేష్ ఉన్నారు.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి
- కర్జవెల్లి-గూడెం బీటీ రోడ్డు నిర్మించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

రైతాంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా రైతుల నుంచి సేకరించిన భూములకు ఇంకా నష్టపరిహారం అందలేదని, తక్షణమే పరిహారం చెల్లించాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న తుమ్మిడిహట్టి, సాండ్‌గాం, రణవెల్లి, కోర్సిని, గూడెం, హుడికిళి, లోనవెల్లి, సూర్జాపూర్, జంబుగ ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు అందించాలన్నారు. ఎన్నో ఏండ్లుగా అసంపూర్తిగా ఉన్న అడ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసి 10 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువుల నుండి పంట పొలాలకు నీరుపారే కాలువలు పూడుకుపోయి, తూము ద్వారం గేట్లు మరమ్మతులకు చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులకు మద్దతుగా త్వరలోనే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కాగజ్‌నగర్ మండలం అంకుషాపూర్‌లో అధికార కాంగ్రెస్ నాయకులు చట్టవిరుద్ధంగా నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులుల అభయరణ్యానికి కేవలం 60 మీటర్ల దూరంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ పూర్తయితే పచ్చని పల్లెలు కాలుష్యం నుంచి బారినపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని కర్జవెల్లి-గూడెం మార్గానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న గుండా గిరిని సహించమని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అప్రోచ్ రోడ్డు లేక వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికార పార్టీలోకి వెళ్ళిన ఎమ్మెల్సీ దండే విఠల్ చొరవతీసుకొని కేజీబీవీ పాఠశాలకు రోడ్డు వేసేలా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీలగౌడ్, రామ్ ప్రసాద్, అవుల రాజు కుమార్ యాదవ్, నవీన్, నాగపూరె బండు పటేల్, దుర్గం వెంకటేష్, చారి గోవింద్ రావు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేస్తానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని గోలేటి బస్టాండ్ వద్ద ఎంపీ సన్మాన సభ నిర్వహించారు. ముందుగా ఎంపీతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.కొత్తపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి అంజనేయులు గౌడ్, ఆసిఫాబాద్ మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వర్‌రావులను సత్కరించారు. ఈ ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ రెబ్బెన మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వినతులు ఇచ్చారని, దాని నిర్మాణంతో పాటు గోలేటిలోని రిజర్వాయర్ ఉన్న కాలువల పూడికలు తీసేసి విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సింగరేణిలో భూములు కోల్పోతున్న వారికి అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా అధ్యక్షులు కూటమిక విజయ్ కుమార్, పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గుల్బం చక్రపాణి, ఆసిఫాబాద్ అసెంబ్లీ కో కన్వీనర్ సొల్లు లక్ష్మీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బొగ్గు బ్లాక్లను నేరుగా సింగరేణికే కేటాయించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంపీ నగేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్, రాయిల్లా నర్సయ్య, సాగర్ గౌడ్ వేలం పాటను రద్దుచేసి నేరుగా సింగరేణికి కేటాయించాలని కోరారు. బొగ్గు బ్లాకులు సింగరేణికి రాకుంటే సింగరేణి మనుగాడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలను చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు నేడే ఆఖరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ప్రయివేటు ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడులలో శిక్షణ పొందడానికి అభ్యర్థులు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జులై 15వ తేదీ వరకు ఐటీఐ.తెలంగాణ.గావ్.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోనే అభ్యర్థులు 10వ తరగతి, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే దరఖాస్తు సమయంలో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు. వివరాల కోసం 9493535378 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు గెస్ట్ టీచర్ల కోసం ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో సోమవారం అతిథి ఉపాధ్యాయ పోస్టులకు సోమవారం ఇంటర్వ్యూను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయంలో సంగీతం, నృత్యానికి కోచ్, టీజీటీ సంస్కృతం, మ్యాథమెటిక్స్, సోషల్ సైన్స్ నాలుగు పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15న ఉదయం నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్, ఒక సెట్ జిరాక్స్ సెట్‌తో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆదిలాబాద్.కేవీఎస్.ఏసీ.ఇన్ వెబ్ సైట్‌ను సందర్శించాలని లేదా ఈ 9730617998 నెంబరును సంప్రదించాలని సూచించారు.

విపత్తుల సమయం..ప్రజలకు అభయం..!

- ఉమ్మడి జిల్లాలో డీడీఆర్ఎఫ్ బృందాల ఏర్పాటు
- వరదలు సంభవిస్తే రంగంలోకి ప్రత్యేక దళాలు
- ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు సత్వర చర్యలు

వర్షాకాలం వచ్చిందంటే ఉమ్మడి జిల్లాలో విపత్తులు సంభవించడం సహజంగా మారుతుంది. వాగులు, వంకలు పొంగిపొర్లడం..పల్లెలను చుట్టుముట్టడం..ప్రాణ, ఆస్తి నష్టం జరగడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఇలాంటి వాటిని సత్వరమే నివారించేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఆయా జిల్లాల వారీగా జిల్లా విపత్తుల నివారణ బృందాలు(డీడీఆర్ఎఫ్)ను ఏర్పాటుచేశారు. జిల్లాలో ఎక్కడ..ఏ సమయంలో వరదలు సంభవించినా ఈ ప్రత్యేక దళాలు కదనరంగంలోకి దూకుతాయి. ప్రాథమిక స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించేందుకు కృషిచేయనున్నాయి. ఇప్పటికే ఈ బృందాలకు అవసరమైన సామగ్రిని అందజేసిన జిల్లా యంత్రాంగం.. ప్రాజెక్టుల్లో ముందస్తు సాధన(రిహార్సల్స్) పూర్తిచేసి సిద్ధంగా ఉంచింది. విపత్తుల సమయంలో ప్రజలను రక్షణగా నిలిచేందుకు ఈ ప్రత్యేక పోలీసు దళాలను అందుబాటులో ఉంచారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో అధిక వర్షాల కారణంగా ప్రతి ఏటా వరదలు సంభవిస్తుంటాయి. నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడం..తీర ప్రాంతాలను చుట్టుముట్టడం వంటి పరిణామాలు సంభవిస్తుంటాయి. భారీగా ఆస్తితో పాటు ప్రాణనష్టం కూడా జరిగిన సందర్భాలున్నాయి. వాగుల సమీపంలో ఉన్న పలు పల్లెలు వరద నీటిలో చిక్కుకుపోవడం.. ఆయా గ్రామాల ప్రజలు ఎటూ వెళ్లలేక ఇబ్బందులు పడుతుంటారు. ప్రతి ఏటా ప్రమాదకరమైన వాగులు దాటుతూ పలువురు మృత్యువాత పడుతున్నారు. గర్భిణీలు, అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి సమస్యలతో పాటు వంతెనలు కూలిపోవడం.. ఇండ్లు కూలిపోవడం, రహదారుల చెట్లు విరిగిపడి ట్రాఫిక్‌జాం వంటి సమస్యలు కూడా ఉత్పన్నమవుతుంటాయి. ఇలాంటి వాటి నుంచి ప్రజలను సత్వరం రక్షించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దళాన్ని ఏర్పాటుచేసింది. ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, కుమురంభీం జిల్లాలోనూ జిల్లా విపత్తుల నివారణ బృందాలను ఏర్పాటుచేశారు.

అత్యవసరంలో కాపాడేందుకు..!

జిల్లాలో వరదలు సంభవించిన సమయంలో ప్రతి ఏటా జాతీయ విపత్తుల నివారణ బృందాలు(ఎన్‌డీఆర్ఎఫ్) జిల్లాకు వస్తుంటాయి. అత్యవసరం సమయంలో జిల్లా ఉన్నతాధికారులు ఈ బృందాలను జిల్లాకు పిలిపిస్తుంటారు. కొన్ని రోజుల పాటు ఇక్కడే మకాం వేసి వరదల సమయంలో వివిధ ప్రాంతాలకు వెళ్తూ జిల్లా ప్రజలకు రక్షణగా నిలుస్తున్నాయి. ఈ బృందాలు అత్యవసర సమయంలో ఇతర ప్రాంతాల నుంచి రావాలంటే కొంత జాప్యం జరిగేది. ఈ బృందాలు జిల్లాకు వచ్చే వరకు ప్రాథమిక స్థాయిలో జిల్లా ప్రజలను సత్వరం ఆదుకునేందుకు జిల్లా స్థాయిలోనే ఒక డీడీఆర్ఎఫ్ బృందాన్ని ఏర్పాటుచేయాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సంకల్పించారు. ములుగు జిల్లాలో ఇలాంటి బృందం ఉండటంతో ఆదిలాబాద్‌లోనూ ఏర్పాటుచేయాలని భావించారు. జిల్లాకు చెందిన పోలీసులు సుమారు 20మంది చురుకైన వారిని గుర్తించి ఈ బృందంలో నియమించారు. వారం రోజుల పాటు హైదరాబాదులో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. జిల్లా కేంద్రం పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తూనే ఈ బృందాలు అత్యవసర సమయంలో విపత్తుల నివారణకు పాటుపడేలా తీర్చిదిద్దారు. వీరికి ప్రత్యేకంగా లైఫ్ జాకెట్, బోట్ వంటి సామగ్రి సమకూర్చారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ బృందాలు ఇప్పటికే సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో రిహార్సల్స్ నిర్వహించాయి. ఆదిలాబాద్ జిల్లా మాదిరిగానే నిర్మల్ జిల్లాలో 162మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 30మంది పోలీసులకు శిక్షణ ఇచ్చి సిద్ధంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు.





సత్వర సాయం అందుతుంది

గౌస్ ఆలం, జిల్లా ఎస్పీ, ఆదిలాబాద్



జిల్లాలో వరదలు, విపత్తులు సంభవించిన సమయంలో డీడీఆర్ఎఫ్ బృందాలు సత్వరం స్పందించి సాయం అందిస్తాయి. ప్రజల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడేందుకు ఈ బృందాలను ఏర్పాటుచేశాం. జిల్లాలో ఎక్కడ వరదలు సంభవించినా అక్కడికి వెళ్లి అవసరమైన రక్షణ చర్యలు చేపడుతాయి.

మార్కెట్ చైర్మన్ మాకే ఇవ్వాలి..!

- నాయకుల చుట్టూ ముధోల్ ఆశావహుల చక్కర్లు

నవతెలంగాణ-ముధోల్



ముధోల్ నియోజకవర్గంలోని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికోసం ఆశావహులు కాంగ్రెస్ కీలక నాయకుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ముధోల్ మండలానికి చెందిన వారికే ఈ పదవి ఇవ్వాలని పెద్ద నాయకులను కలిసి విన్నవిస్తున్నారు. కాగా ఈ విషయం నియోజకవర్గ కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ప్రతిసారి చైర్మన్ పదవి ముధోల్‌కు అందకుండా పోతోందని, ఈ సారి ఎలాగైనా పదవి దక్కించుకోవాలని ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నేండ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తూ, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న పలువురు నాయకులకు ఈ పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. భైంసా మార్కెట్ కమిటీకి మంచి పేరుంది. ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు బాగానే జరుగుతుంటాయి. ఇది జనరల్ కేటగిరి కావడంతో అశావాహులు ఎక్కువగానే పోటీపడుతున్నారు. నామినేటెడ్ పదవి కావడంతో సీనియర్ నాయకులు అయిన మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్, వేణుగోపాలచారిల మద్దతు కీలకం కావడంతో ముధోల్ మండల నాయకులు వారికి నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. కాగా గతంలో మాదిరిగా భైంసాకు చెందిన నాయకుల చైర్మన్‌గిరి ఇస్తారా..? లేక ముధోల్‌కు చెందిన నాయకులకు కేటాయిస్తారా అనేది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆదిలాబాదులో హైడ్రామా..!

- తొలుత కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్ రాజేష్
- కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు ఆఫీస్ వద్ద బీజేపీ శ్రేణుల ఆందోళన
- పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య తోపులాట..స్వల్ప లాఠీఛార్జీ
- తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన పార్టీ మార్పు వ్యవహారం
- అనంతరం మళ్లీ బీజేపీ కండువా కప్పుకున్న సదరు కౌన్సిలర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కౌన్సిలర్ పార్టీ మార్పు వ్యవహారం ఆదిలాబాద్ పట్టణంలో హైడ్రామా నెలకొంది. సాయంత్రం సమయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ పిన్నంవార్ రాజేష్ ఆదివారం సాయంత్రం కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. బీజేపీ కౌన్సిలర్‌ను కిడ్నాప్ చేసి బలవంతంగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు బీజేపీ నాయకులను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాట జరగగా.. స్వల్ప లాఠీఛార్జికి దారితీసింది. అనంతరం సమీపంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులకు చెందిన ఐచర్ వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఆందోళన కారులను పోలీసులు బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించగా ఆందోళన సద్దుమణిగింది.



తిరిగి బీజేపీలో చేరిన రాజేష్

ఆందోళన సద్దుమణిగిన తర్వాత శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి బయటకు వచ్చిన కౌన్సిలర్ రాజేష్ పలువురు బీజేపీ నాయకులతో కలిసి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ నాయకుల సమక్షంలో తిరిగి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సంఘం పని మీద శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లినానని..తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని కాంగ్రెస్‌లో చేరలేదని చెప్పారు. తాను బీజేపీలోనే ఉంటానని పేర్కొన్నారు.





అక్రమాలకు తెరలేపిన డీఈఓపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడా పాఠశాల ఉపాధ్యాయుల నియామకాల్లో అక్రమాలకు తెరలేపిన డీఈఓపై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, వృకోధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ నియమకాలలో పారదర్శకత పాటించలేదన్నారు. రాజకీయ నాయకులు, సంఘాల పైరవీ కారుల ఒత్తిడి మేరకు అర్హత లేని వారికి అక్రమంగా నియమించారని ఆరోపించారు. ఒక సబ్జెక్టుకు ఒకరిని నియమించాల్సింది పోయి ఆంగ్లం, భౌతిక శాస్త్రంలో తనకు అనుకూలంగా ఉన్న ఇద్దరేసిని నియమించారన్నారు. ఇలాంటి డీఈఓ వైఖరి వల్ల జిల్లా విద్యాశాఖ సమాజంలో అబసుపలవుతుందని పేర్కొన్నారు. నియమనిబంధనలు అమలు చేయాల్సిన డీఈఓ అక్రమాలకు పాల్పడుతూ తాను ఇచ్చిన నోటిఫికేషన్‌కు భిన్నంగా నియమకాలు జరిపిన డీఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ పట్టణంలో బంగారుగూడ కాలనీలోకి చెందిన సోదరులపై దాడి జరగడం అమానుషమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆదివారం బాదిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం ఇచ్చారు. మహిళలు అని చూడకుండా కొంతమంది రౌడీ మూకల్లాగా అకారణంగా దాడి చేశారన్నారు. దాడి చేసిన దుండగుల మీద అట్రాసిటి యాక్ట్‌తో పాటు రౌడీషీట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, కాంబ్లే బాలాజీ, జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, నాయకులు చంద్రకాంత్, దాదారావు, సూర్యకాంత్, దీపక్ మోరే, సతీక, మినతాయి, సవిత, అనిత, ఓం ప్రకాష్ యశ్, రాజు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే డ్యాన్స్‌కా భూకంప్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే డ్యాన్స్‌కా భూకంప్ నిర్వహించడం జరుగుతుందని డ్యాన్స్ మాస్టర్, న్యాయనిర్ణేత విశాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో డ్యాన్స్ భూకంప్ నేషనల్ డ్యాన్స్ కంపిటిషన్‌ను కోకిల డ్యాన్స్ అండ్ మ్యూజికల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని, వారి ప్రదర్శనలు ఇచ్చారు. న్యాయనిర్ణేతలుగా డ్యాన్స్ మాస్టర్లు షేరు, విశాల్, మిట్టు దత్తులు వ్యవహరించారు. పాటలకు అనుగుణంగా ఇచ్చిన ఆడిషన్స్ అదిరిపోయాయి. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టార్, న్యాయనిర్ణేత విశాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న డ్యాన్స్ కళాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి డ్యాన్స్ కా భూకంప్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీని సెమీ ఫైనల్ 26న, ఫైనల్స్ ఈనెల 28న ఔరంగబాద్‌లో జరుగుతాయని తెలిపారు. ఫైనాల్స్‌లో న్యాయనిర్ణేతగా బాలివుడ్ కోరియోగ్రాఫర్ రేమో డిసోసతో పాటు ఇతరులు పాల్గొంటారని పేర్కొన్నారు. గెలిచిన వారికి రూ.ఐదు లక్షల ప్రైజ్ మనీ ఉందని తెలిపారు. జిల్లాలో మంచి కళాకారులున్నారని, ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన ఆడిషన్‌లో జిల్లాకు చెందిన వారు ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డ్యాన్స్ మాస్టర్ మిట్టు రవి, నర్మద, సచిన్, శివ, సత్య, నవ్య, కళాకారులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | జులై 15, 2024 | www.navatelangana.com

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని సుభాష్ నగర్ 12వ వార్డులోని ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారని అన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించిన సత్య సాయి సేవా సమితి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు షబ్బీర్ పాషా, సత్య సాయి సేవా సమితి సభ్యులు, వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి పొందిన వారికి సన్మానం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని దీపాయిగూడ గ్రామంలో ఆదివారం దీపాయిగూడ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగోన్నతి పొందిన చంద్రశేఖర్‌రెడ్డిని ఆశామ్మ, అశ్వతరెడ్డి, చంద్రకళ, రమేష్, కళావతి, సీతారాములు, దేవా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఓం ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమోషన్ పొందిన వారికి అభినందనలు తెలియజేశారు. ఊరుకు మంచి పేరు తేవాలని అన్నారు. దేవా సంస్థ నుంచి ఇంకా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సంఘ ప్రతినిధులు తెలియజేశారు.



విద్యుత్ వైర్లకు అల్లుకున్న చెట్టు తీగలు

- పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని మహారాజుల కాలనీలో విద్యుత్ వైర్లకు చెట్టు తీగలు అల్లుకుని, ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంబానికి ఉన్న మూడు వైర్లకు ఈ చెట్టు తీగలు చుట్టుకోవడంతో ఈదురు గాలులు వీచినపుడు చెట్టు ఉగడంతో పాటు విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ అవుతుందని, ఆ చెట్టుకు హెర్తింగ్ వచ్చే ప్రమాదం ఉందని కాలనివాసులు తెలిపారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని, ప్రమాదం జరిగితేనేగాని పట్టించుకోర అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, అల్లుకున్న చెట్టు తీగలను తొలగించాలని కోరుతున్నారు.

పోస్ట్‌మెన్‌ని సన్మానించిన యువసేన

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో గత 32 సంవత్సరాలుగా పోస్ట్‌మెన్‌గా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్లిన పోశన్నను ఆదివారం యువసేన సభ్యులు శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల కేంద్రంలో పోస్ట్‌మెన్‌గా నిస్వార్థంగా విశేష సేవలు అందించి, బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందని అన్నారు. ఉద్యోగంలో బదిలీలు అనేవి తప్పవని అన్నారు. 32 సంవత్సరాలుగా ఒకే దగ్గర పని చేసి అందరు మన్ననలు పొంది, బదిలీపై వెళ్లిన ప్రదేశంలో కూడా విశేష సేవలు అందించి వారి మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువసేన అధ్యక్షుడు సాయిని స్వామి, సభ్యులు మల్లేష్, దత్తు, నరేష్, ప్రవీణ్, సాయి కృష్ణ, గంగాధర్, రవి, మహేష్ పాల్గొన్నారు.

ఇంజనీర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్కిటెక్ ఇంజనీర్స్ అండ్ ఎల్టీపీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం పట్టణంలోని యోగభవన్‌లో నిర్వహించారు. ముందుగా పాత కార్యవర్గ సభ్యులు జనగణమన గీతాన్ని ఆలపించారు. అనంతరం ఇంజనీర్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షుడిగా అన్నదానం జగదీశ్వర్‌ను మరొకసారి ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రవుఫ్, కోశాధికారిగా మాటేటి రాజు, ఉపాధ్యక్షులుగా బేర శ్రీనివాస్, సయ్యద్ సాబిర్‌అలీ, సంయుక్త కార్యదర్శులుగా సుశాంత్, అల్మస్ ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. రెండేండ్ల పాటు సంఘానికి అందించిన సేవకుగాను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని నూతన అధ్యక్షుడు అన్నదానం జగదీశ్వర్ అన్నారు. సంఘంలో అనేక సమస్యలున్నాయని వాటి పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశ్వర్, సందీప్, గౌతమి, సరిత, యోగేష్, సుజాత్ ఉన్నారు.

నేటి బీడీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం చేపడుతున్న బీడీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బి.వెంకట నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కుమురంభీం భవనంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీడీ కార్మికులకు చేయూత పథకం కింద రూ.4వేలు బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలన్నారు. కనీస వేతనం జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో బీడీ కార్మికులందరికీ చేయూత పథకం కింద రూ.4వేలు ఇస్తానని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిన నేటి వరకు అమలు చేయలేదన్నారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజీనామా చేసిన కార్మికులందరికీ రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కళావతి, గంగమ్మ, తారాబాయి పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురికి రిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కులం పేరుతో దూషించి ఆ కుటుంబంపై కొందరు దాడి చేసిన ఘటనలో నలుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేశామని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంగారిగూడకు చెందిన మోరే సూర్యకాంత్ 10న రాత్రి సమయం కాలకృత్యాలకై ఊరి బయటకు వెళుతున్న సందర్భంలో పలువురు వ్యక్తులు అతనిపై కులం పేరుతో దూషించి, అతని కుటుంబ సభ్యులను, అతనిని కర్రతో గాయపరిచినట్టు తెలిపారు. ఈ విషయమై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులు దళితున్ని కించపరిచి, వారి కుటుంబ సభ్యులను మహిళలను కర్రలతో గాయపరిచినందుకు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయబడిందని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు ఏ1 అమీర్‌ఖాన్, ఏ2 మోసిన్‌ఖాన్, ఏ3 సల్మాన్‌ఖాన్, ఏ4 షేక్ ఫైజ్ అరెస్ట్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. నిందితులను వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి 13 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ కై జిల్లా జైలుకు తరలించేందుకు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. కాగా ఈ కేసును డీఎస్పీ దర్యాప్తు చేపడుతున్నారు.

ఎన్నికలకు ఉద్యమంలా సన్నద్ధం కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్థానిక సంస్థల ఎన్నికలకు ఉద్యమంలా సన్నద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దామని, తన నాయకత్వాన్ని నమ్ముకుని వచ్చిన కౌన్సిలందరికీ హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుతున్నానని, ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్నివార్డులు మనమే గెలవాలన్నారు. పాయల్ శంకర్, జోగు రామన్న ఇద్దరూ ఒక్కటేనని, వారిరువురు కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్‌ను గద్దె దించాలని కుట్ర చేస్తున్నారన్నారు. కానీ వారు తీసిన గోతిలో వారే పడతారన్నారు. వారు అడిగితే వైస్ చైర్మెన్ పదవిని జహీర్ రంజానీ విసిరేసి వస్తుండేనన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలలో ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, బదిలీ అయినా ఎస్టీటీ ఉపాధ్యాయులందరినీ విడుదల చేయాలని, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డైట్ కళాశాలలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగోన్నతుల్లో నాన్ జాయినింగ్, లెఫ్ట్ ఓవర్ ఖాళీలకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని అన్నారు. మల్టీ జోన్ 1 అండ్ 2 జోన్‌లలో ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ మధ్యకాలంలో ఆన్‌లైన్ విధానం ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని కానీ అందరూ ఉపాధ్యాయులను పాత ప్లేస్ నుంచి విడుదల చేయలేదన్నారు. తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించి, బదిలీ అయిన ఉపాధ్యాయులందరిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్స్ బదిలీలకు సంబంధించి హైకోర్టులో ఉన్న కేసును సత్వరమే పరిష్కరించి, బదిలీలు అమలు జరిగేలా చూడాలని అన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో గల ఖాళీల్లో సిబ్బందికి బదిలీలు నిర్వహించిన అనంతరమే నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. గురుకులాల టైం టేబుల్ సవరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల అపరిశుభ్రతకై పారిశుధ్య కార్మికులను నియమించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే వర్తింపజేసి, ఉద్యోగులతో సమానంగా అన్ని వర్తింపజేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్య కుమార్, సురేఖ, జిల్లా కోశాధికారి కే.కిష్టన్న, జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, గౌస్ మొయిద్దీన్, విలాస్, శ్యాంసుందర్, స్వరూపరాణి, శివన్న, సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, జిల్లా కమిటీ సభ్యులు, మండలాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ, బీసీ కళాశాల వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు దినేష్ మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఒక్క అధికారి ఇప్పటి వరకు వసతి గృహాలు సందర్శించిన పరిస్థితి లేదన్నారు. వసతి గృహాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే విధంగా ఉన్నాయన్నారు. వర్షాలు పడటంతో విద్యార్థులు తాగేనీరు పంపు నీరు కావటంతో పంపులో మురుగు నీళ్లు వస్తున్నాయని అన్నారు. దోమ తెరలు పంపిణీ చేయక, విపరీతంగా దోమల దాడి చేస్తున్నాయని, దీంతో చాలా మంది విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందటం లేదన్నారు. విద్యార్థులకు భోజనం రుచి లేకపోవటంతో విద్యార్థులు అర్ధ ఆకలితో విద్యను అభ్యసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వసతి గృహాల పరిసరాలు శుభ్రంగా లేకుండా, గడ్డితో ఒక్క అటవిని తలపిస్తున్నాయని అన్నారు. పాములు, తేళ్ల లాంటివి దాడి చేసే పరిస్థితి ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న వసతి గృహాల పరిస్థితి ఇలాఉంటే ఇంకా చుట్టూ పక్కల మండలలో ఉన్న వసతి గృహాల పరిస్థితి ఎలా ఉందో అన్నారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభినందన్, శుభం, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఏడుగురు లబ్దిదారులకు రూ.1లక్షా 38వేల చెక్కులను పంపిణీ చేశారు. మొదటగా హస్సేన్ హుస్సేన్ దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స జరగని వారు అప్పు సోప్పుచేసి చికిత్స చేసుకున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి కింద వెంటనే చెక్కులను అందించడం జరిగేదని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సహాయనిధి చెక్కులపై కేవలం కేసీఆర్ బొమ్మ ఉందనే సాకుతో చెక్కుల పంపిణీ ఆలస్యం చేసి పేదవారికి ఇబ్బంది కలిగించిందన్నారు. ప్రభుత్వాలు ఏవైనా నిరుపేదలకు అందిచే సహాయంలో వివక్ష చూపవద్దన్నారు. అదేవిధంగా త్వరలో కరంజి వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించి, రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు ఎవరు కూడా అధైర్యపడవద్దని మీకు అండగా నేనుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్, లింభాజీ, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, కన్వీనర్ నాగయ్య, నాయకులు నారాయణ, కల్చప్‌యాదవ్, సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలహీన వర్గాల కోసం పోరాడేది ఏఎస్పీ పార్టీ

- రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బడుగుబలహీన వర్గాల పక్షాన పోరాడే ఏకైక పార్టీ ఆజాద్ సమాజ్ పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు ఆ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. అనంతరం షేక్ షకీల్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ, నియామక పత్రాన్ని అందజేశారు. ముందుగా మహనీయులు జ్యోతిరావ్ పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ నాగిని ఎంపీ చంద్రశేఖర్ పేదలు, బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం పార్టీని స్థాపించారన్నారు. వారి హక్కుల కోసం పార్టీని మరింత విస్తరించేలా దేశ వ్యాప్తంగా జిల్లాల్లో అధ్యక్షులుగా నియామకం చేపడుతున్నామని అన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేశాయన్నారు. పేదల పక్షాన ఉద్యమించి, వారి హక్కులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లకు కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడితో పాటు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేల పాటుపడాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఆరీఫ్, ఉపాధ్యక్షుడు వాసుదేవ్, కోశాధికారిగా రహమత్ అలీ, ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుమ్ర గులాబ్‌రావు, ఎస్సీ, మైనార్టీ విభాగాల అధ్యక్షుడు గోపి, ఖుర్షీద్, అస్లాం పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ఉప తెగలకు అవకాశాలు కల్పించాలి

- తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమది ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో ఆదివాసులలోని ఒకే తెగకు ప్రాధాన్యతను ఇవ్వకుండా, అన్నీ తెగలకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ నామినేటెడ్ పదవులలో అవకాశాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఆదివాసులకు నామినేటెడ్ పదువులు ఇవ్వడంలో కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆదివాసుల్లోని అన్ని తెగలు కృషి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఐటీడీఏ చైర్మెన్ పదవీ మిగితా ఆదివాసీ తెగకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నైతం రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి బోజన్న, సోయం రాందాస్, కుంచం గంగాధర్, జిల్లా కార్యదర్శి జాల్కే ముకుంద్‌రావ్ ఉన్నారు.



పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సవర్గాంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని భార్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సవర్గాం గ్రామానికి చెందిన జక్కుల పెదరాజన్న (48) గత ఎన్నో రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శనివారం కడుపునొప్పి తీవ్రం కావడంతో తన చేనులోకి వెళ్లి పురుగులమందు తాగి మృతి చెందాడు. మృతుడు శనివారం ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది చుట్టుపక్కల వెతికారు. కాగా ఆదివారం చేనులోకి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులు తాంసి పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్సై భాస్కర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని కుంటాల జలపాతానికి వెళ్లే రహదారిలో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతేకాకుండా వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించకూడదని అలా నడిపినట్లైతే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుట్టినరోజు పురస్కరించుకుని 9వ బ్యాచ్ ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాయివైకుంఠ ట్రస్టు చైర్మెన్, ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉచిత మగ్గం, టైలరింగ్ శిక్షణ 9వ బ్యాచ్‌ను ప్రారంభించారు. ఆదివారం పట్టణంలో ట్రస్టు భవనంలో ముందుగా కేక్ కట్ చేసి తినిపించారు. అనంతరం తొమ్మిదవ బ్యాచ్‌ను ప్రారంభించి, శిక్షణాంశాల గురించి తెలియజేశారు. మహిళలు స్వయం ఉపాధిలో రాణించేలా సాయివైకుంఠ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 8 బ్యాచ్‌లకు ఉచిత మగ్గం, టైలరింగ్ శిక్షణలను అందించామని ట్రస్టు ప్రధాన కార్యదర్శి రఘువీర్ యాదవ్ అన్నారు. డాక్టర్ రవి కిరణ్ జన్మదినం సందర్భంగా తొమ్మిదవ బ్యాచ్‌ను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రఘువీర్ యాదవ్, సభ్యులు సల్ల విజయ్ బాబు, గట్టయ్య భీమన్న, శిక్షకురాళ్లు శ్రావణి, పూజ రాథోడ్, ఓరుగంటి వీణ, పూజిత, మీనా పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన బాబులాల్‌కు సన్మానం



నవతెలంగాణ-బోథ్

ఉద్యోగ విరమణ పొందిన బాబులాల్‌ను ఆదివారం దేవుల నాయక్ తాండలో జైసేవాలాల్ ఎంప్లాయిస్ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైద్యారోగ్య శాఖలో ఉత్తమ సేవలు అందించి, అందరి మన్ననలు పొంది ఎన్నో అవార్డులు అందుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాథోడ్ రమేష్, గ్రామ పెద్దలు మంగులాల్, గణేష్, వెంకటరావు, రామ్ కిషన్, జైసేవాలాల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీ కోసం కొత్తగూడెంకు ప్రత్యేక బస్సు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఆదిలాబాద్ నుంచి కొత్తగూడెంకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22న సాయంత్రం 7:00 గంటలకు ఆదిలాబాద్ ఆర్టీసీ ప్రాంగణం నుంచి బయలుదేరి ఉదయం 5:30 గంటలకు కొత్తగూడెం చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 23న సాయంత్రం 6:00 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు బస్ టికెట్ల కోసం ముందస్తుగా ప్రయాణ ప్రాంగణంలో రిజర్వేషన్ కౌంటర్‌లో లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌లో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

స్తంభం వేశారు.. తీగలు మరిచారు

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బిబ్రా గ్రామంలో ప్రధాన రహదారి సమీపంలో విద్యుత్ స్తంభం వేసిన విద్యుత్ అధికారులు తీగలను అమర్చడం మర్చిపోయారు. గత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారి సమీపంలో విద్యుత్ తీగలు చకినాల రాజన్న ఇంటిపై కప్పు పై వేలాడుతుండడంతో సమస్యను గుర్తించిన అధికారులు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కానీ నేటి వరకు స్తంభానికి తీగలను అమర్చకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది. ప్రమాదం సంబవించి ప్రాణాలు పోకముందే అధికారులు స్పందించి తీగలను స్తంభానికి అమర్చి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రక్తదానం చేసి.. గర్భిణీని కాపాడి..

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు సల్మాన్ రక్తదానం చేసి ఉదరత చాటారు. వివరాల్లోకి వెళ్తే బెజ్జూరు మండలం తలాయి గ్రామానికి చెందిన సడ్మేక తులసిరాం భార్య లక్ష్మి 8 నెలల గర్భవతి జిల్లా ఆస్పత్రికి రాగా మహిళకు 4 గ్రాములు మాత్రమే రక్తం ఉందని రక్తం అవసరముంటుందని వైద్యులు తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు సల్మాన్ స్పందించి తనతో పాటు మరొకరిని తీసుకువచ్చి మహిళకు కావాల్సిన రక్తం అందజేశారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీకి రక్త అందించిన సల్మాన్‌ను పలువురు అభినందించారు. ఆపదలో ఉన్న గర్భిణిని కాపాడడం సంతోషంగా ఉందని తెలిపారు. గర్భిణీ కుటుంబీకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి కేంద్రం నిధులు తీసుకువస్తా

- ఎంపీ గోడం నగేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా అభివృద్ధికి అవసరమైన కేంద్రం నిధులు తీసుకువస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్మాన సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు విశాల్, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కోట్నాక విజయ్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డేపల్లి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కేంద్రం నిధులు తీసుకువస్తామన్నారు. అంతకుముందు నాయకులు మాట్లాడుతూ వివిధ సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకురాగా వాటిపై స్పందిస్తూ అసంపూర్తిగా ఉన్న గుండి బ్రిడ్జి నిర్మాణానికి, ఆడ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధుల కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోనగిరి సతీష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, ఎమ్మార్పీఎస్ నాయకుడు రేగుంట కేశవ్, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వ్యవసాయ ఆధారిత జిల్లాతో పాటు గిరిజన జిల్లా కావడంతో జిల్లాలో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ కోరారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఎంపీ గోడం నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నత విద్య విషయంలో చాలా వెనుకబడి ఉందని, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల చదువు కోసం ఉన్నత విద్యా సంస్థలు లేవన్నారు. వ్యవసాయంపై ఆధారపడి ఎక్కువ కుటుంబాలు జీవిస్తున్న నేపథ్యంలో వారికి అనుగుణంగా ఉండే విధంగా జిల్లాలో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ దీనిపై సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు గజ్జల లక్ష్మణ్, యువ నాయకులు బొట్టుపల్లి సాయి కృష్ణ, సామజిక కార్యకర్త కల్లూరి ప్రశాంత్, టొమ్రే శ్రీకాంత్ పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పోతపెల్లి గ్రామానికి చెందిన యువకుడు నాపై చేసిన అసత్యపు ఆరోపణలు మానుకోవాలని అదే గ్రామానికి చెందిన చౌదరి గోపాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గత 15 రోజుల కిందట పోతపెల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామ యువకులు అడ్డుకున్నట్టు, తమ గ్రామానికి చెందిన వారికే ఇసుకను వాడుకొనేలా చేసుకోవాలని, వేరే గ్రామానికి తీసుకెళ్తే శిస్తు చెల్లించాలని అన్నట్టు తెలిపారు. ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామ యువకులను దుర్భాలాడాలని ఆరోపించారు. బెదిరింపులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

జాగా దొరికితే పాగా..దర్జాగా కబ్జా..

- జిల్లా కేంద్రంలో పెరుగుతున్న అక్రమ టేలాల సంస్కృతి
- అధికారులపై నేతల ఒత్తిళ్లు..?
- మున్సిపాలిటీగా మరినా మారని తీరు



డి.ఎస్.పి కార్యాలయం ఎదుట వేసిన టేలాలు



ప్రభుత్వ ఆస్పత్రి రహదారిలో వేసిన టేలాలు

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో జాగా దొరికితే కబ్జాదారులు పాగా వేస్తున్నారు. అంబేద్కర్ చౌక్ నుండి వివేకానంద చౌక్ మీదుగా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ బాలికల పాఠశాల ముందు వరకు ఇటువైపు డీఎస్పీ ఆఫీస్ వరకు అక్రమ టేలాల సంస్కృతి కొనసాగుతోంది. లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉన్నప్పటికీ అతి తక్కువ మొత్తంలో కిరాయిల రూపంలో వస్తుంది. దీంతో పాటు ఇష్టం వచ్చినట్టుగా టేలాలు వేయడంతో రోజురోజుకు ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా పంచాయతీ టేలాలు ఉండడంతో టెండర్ దారులు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఈ సందర్భంలో జిల్లా కేంద్రంలోని అక్రమ టేలాలు, ప్రజల ఇబ్బందుల ప్రత్యేక కథనం.

జాగా దొరికితే పాగా దర్జాగా కబ్జా

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుండి ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వరకు ఇరువైపులా, బాబాపూర్ వెళ్ళే మార్గంలోని మర్రిచెట్టు చౌరస్తా వద్ద ఇష్టారాజ్యంగా అక్రమార్కులు టేలాలతో కబ్జా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మొత్తం గతంలో 280 వరకు టేలాలు ఉండగా ఆ సంఖ్య ఇప్పుడు 350కి పెరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ ఖాళీ జాగా ఉంటే అక్కడ చిన్నగా మొదట ఆక్రమించి తర్వాత అదే స్థానంలో శాశ్వత షెడ్డు నిర్మిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో పెరుగుతున్న అక్రమ టేలాలు

జిల్లా ఆవిర్భావానికి పూర్వం కొంత స్థలం ఖాళీగా ఉండేది. అయితే జిల్లా ఆవిర్భావం తర్వాత జనాభా పెరగడం స్థలం లేకపోవడంతో ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్ను పడింది. దీంతో మార్కెట్‌కు అనువైన ప్రధాన ప్రాంతం కావడంతో అక్రమంగా టేలాలు వెలుస్తున్నాయి. అక్రమంగా టేలాలు వేయడంతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రహదారి మినహా మిగతా ప్రాంతాన్ని ఆక్రమించారు. ఇదే ప్రాంతంలో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల ప్రహరిని అనుకోని టేలాలు వేయడంతో పాఠశాలను వెతకాల్సిన పరిస్థితి వస్తోంది.

అధికారులపై నాయకుల ఒత్తిళ్లు..?

టేలాలు తొలగించడానికి 2021లో అప్పటి పంచాయతీ అధికారులు ప్రయత్నించి అక్రమంగా ఆక్రమించిన వాటికి తాళాలు వేశారు. వారికి అండగా ఉన్న నాయకులు అధికారులను బెదిరింపులకు గురి చేయడంతో తామేమి చేయలేకపోతున్నామని అప్పుడు ఉన్న ఒక అధికారి చెప్పడం నాయకుల ఒత్తిళ్ల ఏ మేరకు ఉన్నాయనే విషయం అర్థమవుతుంది. గతంలో జిల్లా ఆవిర్భావం కంటే ముందు సబ్ కలెక్టర్‌గా పని చేసిన దేవవ్రతకంట టేలాలపై ఉక్కు పాదం మోపినప్పటికీ, ఆయన బదిలీ తర్వాత శరామాములుగా మారింది. రోజురోజుకు పెరుగుతున్న అక్రమ టేలాలకు నాయకులు వంతపడడంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీ ఆదాయానికి గండి

జిల్లా కేంద్రంలో ఎక్కువగా డిమాండ్ ఉన్న ప్రాంతం అయిన అక్రమ టేలాలతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతుంది. పాత మార్కెట్ ప్రధాన రహదారిపై 280 వరకు టేలాలున్నాయి. వీటికి నామమాత్రంగా మున్సిపాలిటీ అధికారులు అద్దె వసూలు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో అక్రమార్కులు మూడు నుండి ఐదు టేలాలు వేసుకొని వేరే వ్యక్తులకు కిరాయికి ఇవ్వడంతో పాటు ఈ ప్రాంతంలో ఉన్న డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని రూ.2 నుండి రూ.3 లక్షలు వరకు అడ్వాన్స్ తీసుకోవడంతో పాటు రూ.5000 నుండి రూ.7000 కిరాయి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో అధికారులు దీనిని రూపుమాపడానికి ప్రయత్నం చేసినప్పటికీ వారితో సాధ్యం కాలేదు.

మున్సిపాలిటీగా మారిన మారని తీరు

జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటి నుండి అక్రమ టేలాల సంస్కృతి పెరిగిపోతోంది. గతంలో పాత మార్కెట్ ప్రధాన రహదారికి ఆనుకొని మాత్రమే టేలాలు ఉండేవి. కానీ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఈ సంస్కృతి కొనసాగుతోంది. మున్సిపాలిటీకి సంబంధించి పూర్తి రూపురఖలు రాకపోవడంతో అధికారులు కూడా ఏమీ చేయలేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తుంది.

మున్సిపాలిటీ మార్పు పూర్తయ్యాక తీసివేస్తాం

- భుజంగరావు, మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీగా మారినప్పటికీ ఇంక పూర్తిస్థాయి మార్పు ప్రక్రియ కాలేదు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్రమంగా, ఎటువంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న టేలాలు తొలగిస్తాం. మున్సిపాలిటీ డిజైన్‌లో రహదారులు కూడా వెడల్పు ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా రహదారులు వెడల్పు చేస్తాం.

నేడు ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా



రిలే దీక్షల శిబిరం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై సోమవారం ఎమ్మెల్యేల ఇంటి ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు, దీన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 10ను రద్దు చేయాలని తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీల ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ మొత్తాన్ని టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్షకు పెంచాలన్నారు. దీంతో పాటు వివిధ రకాల సమస్యలు పరిష్కరించే ఉద్దేశంతో సోమవారం నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మడవి గంగామణి, జంగుబాయి, తార, హిరబాయి పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వాతావరణ శాఖ వర్ష సూచన నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులలో వరద నీరు వచ్చి చేరుతుందని, దీంతో నీరు బయటికి వదిలే అవకాశం ఉన్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత ఇండ్లలో ఉన్నవారు వెంటనే వాటిని ఖాళీ చేయాలని, ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలోని పోలీసులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు వివరించారు. వాగులు పొంగే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు వాగులు దాటేటప్పుడు జాగ్రత్తలు వహించాలని ఎక్కువగా నీరు ఉన్నచోట వాగు దాటకూడదన్నారు. ప్రాణహిత నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరు చేపల వేటకు వెళ్లకూడదన్నారు. ఎక్కడైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

గుంతలు పూడ్చడానికి ఇంకెన్నేండ్లు..?



నవతెలంగాణ-దహెగాం

ప్రభుత్వాలు..ప్రజా ప్రతినిధులు మారిన చివరికి అధికారులు మారిన ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదు. దీనికి ఉదాహరణ కాగజనగర్ నుండి దహెగాం వెళ్లే ప్రధాన రోడ్డుకు పెసరికుంట స్టేజి సమీపంలో మూడు సంవత్సరాల క్రితం వరదలు వచ్చినప్పుడు ఏర్పడ్డ గుంత. ఈ రోడ్డు గుండ నిత్యం మండల కేంద్రానికి వెళ్లే చిన్న పాటి ఉద్యోగి నుండి మండల స్థాయి ఉద్యోగి వరకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే చిన్న పెద్ద నాయకులు సైతం ఈ దారి గుండనే కాగజ్‌నగర్ పట్టణానికి నిత్యం ప్రయాణిస్తుంటారు. వీరే కాకుండా జిల్లా స్థాయి అధికారులు నాయకులు సైతం ఈ దారిగుండనే ప్రయాణిస్తూ చూస్తుంటారు. కానీ కొత్మీర్ నుండి మొదలుకొని మండల కేంద్రం వరకు చాలాచోట్ల ఇలాంటి గుంతలే దర్శనమిస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు ప్రజా ప్రతినిధులు కనీసం గుంతలలో తట్టెడు మట్టిని పోసేందుకు కూడా ముందుకు రాకపోవడం విడ్డూరం. ఎప్పటికప్పుడు రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చాల్సిన రోడ్డు భవనాల శాఖ అధికారులు సైతం తమ నిద్ర మత్తును వీడడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో వర్షాకాలంలో గుంతలలో పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు తమ నిద్రమత్తును వీడి గుంతలను పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వారబందికనుగుణంగా నీటిని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వట్టివాగు ప్రాజెక్టు కింద సాగు చేసుకుంటున్న రైతులు వారాబంధికనుగుణంగా నీటిని వినియోగించుకోవాలని వట్టివాగు ఏఈ షేక్ జానీ తెలిపారు. మొదటి దశలో ప్రతి సోమవారం ఉదయం 8 గంటల నుండి గురువారం ఉదయం 8 గంటల వరకు డీ3, డీ5, డీ6, డీ7, డీ8 డిస్ట్రిబ్యూటరీలకు సాగునీరు అందించడం జరుగుతుందని, రెండవ దశలో గురువారం నుండి సోమవారం వరకు డీ4, డీ9, డీ10, డీ11, డీ12 డిస్ట్రిబ్యూటరీలకు సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు సాగునీటిని సరైన విధంగా వాడుకొని సద్వినియోగం చేసుకోవాలని, ఆయకట్టు స్థిరీకరణకు తమకు సహకరించాలని కోరారు. అక్టోబర్ 31 వరకు ఈ వారాబంది కొనసాగుతుందని వివరించారు.

ఆయిల్ ఫామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



ఆయిల్ ఫాం చేస్తున్న రైతుకు సూచనలు చేస్తున్న అధికారులు



పంటను పరిశీలిస్తున్న అధికారులు

- లక్ష్యం చేరుకునే దిశగా అధికారుల ప్రయత్నాలు
- పంట సాగుకు ప్రభుత్వాల సబ్సిడీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంటల్లో వస్తున్న వినూత్న మార్పులతో పాటు ప్రజల అవసరాలే లక్ష్యంగా రైతులు, ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. దీనిలో భాగంగా కాలానుగుణంగా వరి పంట నుండి రైతులు పత్తికి అలవాటు పడ్డారు. ప్రత్యామ్నయ, లాభాదాయక పంటల వైపు రైతులను మళ్లించేందుకు ప్రజల నిత్యవసరాల్లో భాగమైన వంటనూనెకు ఉపయోగపడే ఆయిల్ ఫామ్ తోటపై ప్రోత్సహిస్తున్నారు. రైతులు కూడా లాభాదయక పంట కావడంతో ఆసక్తి చూపుతున్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేసి ఎగుమతి చేయడంతో మలేషియా, ఇండోనేషియా దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించాయి. ఇదే సందర్భంలో అధికారులు కూడా రైతులను ఆయిల్ ఫామ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయిల్ ఫాం సాగుపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

ఆయిల్ ఫామ్ తో ఆర్థిక అభివృద్ధి

ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ ఫామ్ సాగు చాలా సులభం. పంట వేసిన నాలుగో సంవత్సరం నుండి నిరంతరం 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తోంది. మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటలు కూడా సాగు చేయవచ్చు. మొదటి నాలుగు సంవత్సరాల నుండి ఎనిమిది సంవత్సరాల వరకు నాలుగు నుండి ఆరు టన్నులు దిగుబడి వస్తోంది. తర్వాత ఈ దిగుబడి పెరుగుతూ ఒక దశలో ఎకరానికి రూ.లక్షల ఆదాయం వస్తుంది.

లక్ష్యం చేరుకునే దిశగా అధికారుల ప్రయత్నాలు

జిల్లాలో భూములు ఆయిల్ ఫామ్ పంటకు అనుకూలంగా ఉండడంతో ఉద్యానవన శాఖ అధికారులు 2000 ఎకరాల లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు 1000 ఎకరాల వరకు పంట సాగు అవుతుండగా మరో 1000 ఎకరాలు ప్రస్తుత సీజన్‌లో లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. దాని అనుగుణంగానే ప్రణాళికలు చేసుకుంటు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పంట దిగుబడి, లాభాలు తదతర వాటిని వారి పంట క్షేత్రల్లోకి వెళ్లి వివరిస్తున్నారు.

పంట సాగుకు ప్రభుత్వాల సబ్సిడీ

రైతులను పంట సాగుపై ఆసక్తి పెంచే ఉద్దేశంతో ప్రభుత్వాలు పంట సబ్సిడీ ఇస్తున్నాయి. ఆయిల్ పామ్ సాగుకు కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయిస్తున్నాయి. ఎకరం ఆయిల్ పామ్ సాగుకు మొక్కలు, డ్రిప్, అంతర పంటల సాగుకు, ఎరువుల యాజమాన్యం కోసం రూ.50వేల రాయితీ కల్పిస్తారు. ఆయిల్ పామ్ మొక్కలకు రూ.11,600, బిందు సేద్యం కోసం రూ.22,518 రాయితీ ఇస్తారు. మొదటి నాలుగేళ్ల ఎకరం అంతర పంటల కోసం రూ.2,100, అయిల్ పామ్ తోట యాజమాన్యం కోసం ఎరువులకు రూ.2,100 చొప్పున సంవత్సరానికి రైతు రన్నింగ్ బ్యాంక్ ఖాతాకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తారు. దీనితో పాటు డ్రిప్‌పై కూడా రైతులకు రాయితీ కల్పిస్తున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

వెంకటేశం, జిల్లా ఉద్యాన శాఖ అధికారి.

ఆయిల్ పామ్ సాగు రైతు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడుతుంది. ప్రభుత్వం మొక్కలు, డ్రిప్‌పై సబ్సిడీలు ఇస్తుంది. రైతులకు తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం అర్జించే అవకాశం ఆయిల్ పామ్ సాగులో ఉంటుంది. రైతులకు అవసరమైన సాయం చేయడానికి నిరంతరం అందుబాటులో ఉంటాం. రైతులు లాభాదయ పంటల వైపు దృష్టి సారించాలి.

దళితులకు పోడు పట్టాలివ్వాలి

నవతెలంగాణ-వాంకిడి



ఉత్తర తెలంగాణ గోదావరి పరివాహక ప్రాంతంలోని అదిలాబాద్ నుండి భద్రాచలం వరకు నిరుపేదలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టా లతో పాటు దళితులకు కూడా ఏజెన్సీ ప్రాంతంలో పహనీలు ఇవ్వాలని నేతకాని రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఇందాని గ్రామంలో నేతకాని మహా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇందాని గ్రామంలో అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సురేష్, లక్ష్మణ్, జిల్లా మండల నాయకులు జాడి అరుణ్, దుర్గం వెంకటి జాడి అశోక్, సునార్కర్ కుష్లిక్, జాడి చిత్రు, రాంటెంకి ప్రభువు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | జులై 15, 2024 | www.navatelangana.com

మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ మేళా

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని గొర్లపల్లి, రాజారాం, జిల్లెడ, చామనపల్లి గ్రామాల్లో ఆదివారం మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ మేళాను నిర్వహించినట్లు ఉద్యానవన అధికారి సీహెచ్ సుప్రజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా నలుగురు రైతులు 649 మొక్కలు నాటారని అన్నారు. ఆయిల్ ఫామ్ తోట లాభదాయకంగా ఉంటుందని, ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ఆయిల్ ఫామ్ మొక్కలను పంపిణీ చేస్తుందని అన్నారు. రైతులు ఆయిల్ ఫామ్ తోటలపై దృష్టి సారించి అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్రిక్స్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ మధుకర్, జైన్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ జయాకర్, రైతులు గుర్నుల చిన్నన్న, సూర లక్ష్మి పాల్గొన్నారు.

జన్నారం ఎంపీపీ, జెడ్పీటీసీలకు సన్మానం

నవతెలంగాణ-జన్నారం



ఎంపీపీగా మా దాడి సరోజన, జడ్పీటీసీగా ఎర్ర చంద్రశేఖర్ ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా యాదవ సంఘం మండల అధ్యక్షుడు గట్టు మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం యాదవ సంఘం భవనంలో వారిని శాల్వా పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి వారు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అలాగే జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్‌ను శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మందమర్రి

సారంగపల్లి గ్రామంలో ఆదివారం సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కలుషితమైన నీరు తాగడం వలన కలరా, రక్త విరోచనాలు, నీళ్ల విరోచనాలు, పోలియో, కామెర్లు మొదలగు వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. వ్యాధులు రాకుండా ఉండడానికి ప్రతీ ఒక్కరూ కూడా వేడి చేసి చల్లార్చిన నీటిని ఫిల్టర్ చేసి తాగితే మంచిదని సూచించారు. అంతేకాకుండా మనం తాగే నీటిని తినే ఆహార పదార్థాలను సురక్షితంగా శుభ్రపరచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఇంటి చుట్టు ప్రక్కల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ రోజు నిర్వహించిన ఉచిత వైద్య సదుపాయాన్ని సారంగపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు కూడా సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాలను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రచురించిన కర పత్రాలను ఆవిష్కరించి అధికారులకు, గ్రామ పెద్దలకు స్థానికులకు అందించారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, పర్యావరణ అధికారి ప్రభాకర్, డీవై సీఎంఓ డా.ఉష, డీవై పీఎం మైత్రేయ బంధు, ఎస్టేట్ అధికారి వెంకటరెడ్డి, సెక్యూరిటీ అధికారి రవి, డా.శ్రీధర్, డా.జయవాని, సీనియర్ పీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గతేడాది గల గల.. ప్రస్తుతం వెల వెల..!



నవతెలంగాణ-జైపూర్

గత ఏడాది ఈ పాటికి గోదావరి నది పొంగి ప్రవహిస్తోంది. హద్దులు దాటిన గోదావరి పంట పొలాల్లో పరవళ్లు తొక్కింది. ఈ ఏడాది వర్షాలు లేక గోదావరి నదిలో నీరు లేక వెళ వెళబోతోంది. 2023 జూలై నెలలో ఏకదాటిగా కురిసిన వర్షాలతో గోదావరి నదితో పాటు చెరువులు, కుంటలు నిండు కుండలను తలపించగా ఈ ఏడాది చుక్క నీరు చేరక చెవులు కుంటు వెలవెలబోతున్నాయి. గత ఏడాది భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడగా అవసరమైతే తప్పా ఇంటి నుండి బయటకు వెల్లవద్దని, గోదావరి తీర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మొత్తంగా చూస్తే మండల పరిధిలో నాడు గోదావరి నది హద్దులు దాటి గళగళ పారింది.ఈ ఏడాది నీటి జాడ లేక వెళ వెళ బోతుంది..



మండలంలో పోచమ్మ బోనాలు



నవతెలంగాణ-హాజీపూర్


ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గుడిపేట్ ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద గల బుగ్గ పోచమ్మ, నల్ల పోచమ్మలకు బోనాలు సమర్పించి అక్కడే వన బోజనాలు చేశారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు ఆశించిన వర్షాలు కురవకపోవడం రైతు కుటుంబాలు పెద్ద ఎత్తున ఈ బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి.

జన్నారం : మండలంలోని పొన్కల్ గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఊర పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే కాపు సంఘం నాయకులు మహిళలు పవిత్ర గోదావరి స్నానాలు ఆచరించి, ఒక్క పొద్దులతో ఇళ్లలో బోనాలు వండుకొని, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరారు. ఊర పోచమ్మ ఆలయానికి వెళ్లి, బోనాలను సమర్పించి, పోచమ్మకు ప్రత్యేక నైవేద్యాలతో మొక్కలు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లెక్కల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి జలపతి, సీనియర్ గోపి సత్యనారాయణ, రాజన్న, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీఎం సూచన.. కలెక్టర్ ఆచరణ..!

● గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు



నవతెలంగాణ-జైపూర్

జాతీయ రహదారుల నిర్మాణాల్లో భూ సేకరణలో వేగం పెంచాలని, భూములు కోల్పోతున్న రైతులతో సంప్రదింపులు జరిపి వారికి న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచనతో కలెక్టర్లు చర్యలు చేపట్టారు. దీంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పరిహారం పెంచాలని ఇదివరకే పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసిన బాధిత రైతులు తమ భూములకు మార్కెట్ రేట్‌తో పరిహారం చెల్లించాలని కోరారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందో ఆ మొత్తం రైతులకు దక్కేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు మరుసటి రోజు మండల రైతులకు కలెక్టర్ కబురు పంపారు. కలెక్టర్ కార్యాలయంలో కలిసి రైతులతో మాట్లాడిన కలెక్టర్ కుమార్ దీపక్ ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి వారితో ముఖాముకి ఏర్పాటు చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు.

మార్కెట్ రేటు ఇవ్వాలని డిమాండ్

నాగాపూర్-విజయవాడ మధ్యన నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో జైపూర్ మండల పరిధిలో గల వివిధ గ్రామ శివారులకు సంబంధించిన 272 ఎకరాల 39 గుంటల భూమిని మండల రైతులు నష్టపోతున్నారు. సుమారుగా 650 మందికి చెందిన వ్యవసాయ భూములు రసూల్‌పల్లి నుండి గోపాల్‌పూర్ శివారు గోదావరి నది వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం పట్ల బాధితులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నష్టపోతున్న భూములు బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలుకుతోందని కలెక్టర్‌ను కలిసిన రైతులు వివరించారు. కాగా ప్రాంతాల వారిగా నష్టపరిహారం నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పటికే బాధిత రైతులకు నోటీలు జారీ చేసింది. ఎకరాకు రూ.4 లక్షల 35 వేల నుండి రూ.12 లక్షల వరకు నిర్ణయించి నోటీసులు జారీ చేయడంతో రైతులు తమ భూములు ఇవ్వడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం చెల్లిస్తే తప్పా భూములను వదులుకోలేమని గత ఏడాదిగా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను కలిసి వినతీ పత్రాలు అందజేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరతో పోల్చి చూస్తే బహిరంగ మార్కెట్ ధరలో ఎంత మాత్రం పొసగడం లేదంటున్న రైతులు నష్టపోతున్న భూములకు బదులుగా మరో చోట భూములు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 19న ముఖాముఖి ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువగా పరిహరం చెల్లింపుకు కృషి చేస్తామని కలెక్టర్ దీపక్ కుమార్ హామీ ఇచ్చినట్లు బాధిత రైతులు తెలిపారు.

పదేపదే భూములు నష్టపోతున్న రైతులు

గతంలో సింగరేణిథర్మల్ విద్యుత్ ప్లాంట్, ఇందారం ఓపన్‌కాస్ట్ గని ఏర్పాటుకు వేల ఎకరాలు నష్ట పోవల్సి వచ్చింది. ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో మరింత భూమి నష్టపోతుండగా వ్యవసాయ క్షేత్రంగా విలసిల్లిన మండలంలో వ్యవసాయ క్షేత్రాలు అభివృద్ధి మసకబారిపోతున్నాయని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరై భూములను నష్టపోవల్సి వచ్చినా పరిహారం చెల్లింపుల్లో అన్యాయం జరుగుతుందని, ఇక్కడ నష్టపోయిన భూమిని మరో చోట కొనుగోలు చేయాలనుకుంటే రెట్టింపు ధరలతో కొనుగోలు చేయాల్సివస్తోందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పరిస్థితులపై అధ్యయనం చేసి న్యాయపరంగా పరిహారం చెల్లిస్తే మరో చోట భూములు కొనుగోలు చేసి వ్యవసాయాన్ని కొనసాగించడానికి ప్రభుత్వం సహకరించాలని మండల పరిధి బాధిత రైతులు అభ్యర్థిస్తున్నారు.

ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలి

● సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యుడు ఆశయ్య



సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

నవతెలంగాణ-జైపూర్

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సామాజిక సంఘాలు, వామపక్ష పార్టీలు, లౌకికవాదులు, మేధావులు కలిసి ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ళ ఆశయ్య అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమావేశంలో చర్చించుకున్న నాయకులు కర్తవ్యాలపై దృష్టి సారించారు. ప్రధానంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల బిల్లుల చెల్లింపు, ఇండ్ల స్థలాలకు పట్టాలు, రూ.5 లక్షల ఇవ్వడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. శ్రావణపల్లి బొగ్గు గనులు సింగరేణికి ఇవ్వడం, ప్రయివేటీకరణ ఆపివేడం, కార్మికులు స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారంలో పార్టీ పరంగా కృషి చేయాలని సమావేశంలో చర్చించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శి వర్గ సభ్యులు అశోక్, దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, దుంపల రంజిత్ కుమార్, గోమాస అశోక్, దాగం రాజారాం పాల్గొన్నారు.

స్క్రాపు దొంగతనాలపై ప్రత్యేక దృష్టి

● తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్

నవతెలంగాణ-తాండూర్



సింగరేణి ఆస్తులకు సంబంధించిన స్క్రాపు దొంగతనాలపై ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఆదివారం రేచీని గ్రామపంచాయతీలోని బారేపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంలో సింగరేణి ఆస్తులకు సంబంధించిన ఇనుము, తుక్కు, స్క్రాపు దొంగతనాలకు సంబంధించిన ఫిర్యాదుల నమోదవుతున్న నేపథ్యంలో దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మండలంలోని బోయపల్లి బోర్డు, తాండూర్ కాపు వాడ, రాజీవ్ నగర్ పంచాయితీ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అనునిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో అనుమానిత వ్యక్తుల కదలికలను పసి కడుతున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులు ముందస్తు జాగ్రత్తగా ప్రధాన కూడళ్ల వద్ద గృహ సముదాయాల ఎదుట వ్యాపార సముదాయాల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. దుకాణం ఎదుట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్న యజమాని జనార్ధన్‌ను తమ పోలీసు శాఖ తరఫున అభినందించారు.

క్వారీ జాతరకు ఏర్పాట్లు పూర్తి



● ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

నవతెలంగాణ-హాజీపూర్

మండల పరిధిలోని గడ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని క్వారీలో ఈ నెల 21న జరుగనున్న దుర్గాదేవి జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు తెలిపారు. ఆదివారం దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దుర్గాదేవి అమ్మవారి దర్శనంకు వీఐపీ మార్గం లేదని అన్నారు. అలాగే వెహికిల్, దర్శనం టికెట్లకు డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదని చెప్పారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు సౌకర్యం కల్పిస్తామని అన్నారు. మంచిర్యాల మున్సిపల్, గడ్‌పూర్ గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

జైపూర్ ఏసీపీ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం మద్దికల్ శివారు భూముల విషయంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తమకు అండగా నిలిచారని ఆరెపల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబాల వారు కీర్తించారు. ఈ సంధర్భంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. తాము సాగు చేసుకుంటున్న భూములను కొందరు అక్రమంగా పట్టాలు చేసుకోవడం పట్ల ఏసీపీ వెంకటేశ్వర్లు ద్వార తమకు న్యాయం జరిగిందని తెలిపారు. మద్దికల్ శివారులో పంటలు సాగు చేసిన భూములను ట్రాక్టర్లతో ధ్వసం చేసిన బీఆర్ఎస్ నాయకుడు చెర్కు సరోత్తంరెడ్డి అనుచరుడు కట్ట నాగరాజు, కాంగ్రెస్ నాయకుడు పర్తిరెడ్డి మహేశ్వర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కట్ట నాగరాజును జైలుకు పంపారని తెలిపారు. అదేవిధంగా రైతులను బెదిరింపులకు గురి చేసిన నల్లాల రాజలింగుపై కేసు నమోదు చేయడం పట్ల ఆరెపల్లి గ్రామానికి చెందిన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా మొయ్య రాంబాబు ఎన్నికయ్యారు. ఆదివారం సింగరేణి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహికంచిన ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి ఎన్నికల్లో మొయ్య రాంబాబు, మేడి రాజు పై విజయం సాధించారు. 310 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొయ్య రాంబాబు 177 ఓట్లు సాధించగా, ప్రత్యర్థి మేడి రాజు 111 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. విజయం తో రాంబాబు నివాసం వద్ద, ఆటో స్టాండ్ వద్ద అనుచరులు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి



నవతెలంగాణ-జైపూర్

భీమారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరెపల్లికి చెందిన వనపర్తి చందన ఈ నెల 7న ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ రాములు తెలిపారు. భర్త అనపర్తి జంపన్న తోపాటు కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి చందన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పురుగుల మందు తాగిన చందనను మంచిర్యాల ఆస్పత్రికి తరలించి వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ పట్టణంలోని కెల్విన్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. చందన తండ్రి దుర్గం తిరుపతి ఫిర్యాదు మేరకు చెందిన భర్త జంపన్నతో పాటు తల్లి లక్ష్మి ఆడబిడ్డ వెంకటమ్మ తండ్రి కనకయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్టును నియమించాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమించాలని ఐద్వా మండల అధ్యక్షురాలు పోతు విజయ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు 33 గ్రామాలు ఉన్నాయని, అధికంగా గిరిజన గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఈ గ్రామాల నుంచి గర్భిణులు అధిక సంఖ్యలో ఆసుపత్రికి వస్తున్న తరుణంలో గైనకాలజిస్టు డాక్టర్ లేకపోవడంతో గర్భిణులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే గైనకాలజిస్టును నియమించి ప్రసూతి వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చి గర్భిణుల ఇబ్బందులును తొలగించాలని కోరారు.